తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
22 మే 2026
పేజీలు : 08





# చట్టం సైలెంట్... అక్రమం వైలెంట్!

## ఎన్ఓసీ కవచంగా అదనపు అంతస్తులు... కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాలకు అడ్డా?

- న్యాక్ టీమ్ మౌనం... సెక్షన్ ఆఫీసర్‌పై తీవ్ర ఆరోపణలు
- చిన్నవారిపై కఠిన చర్యలు... పెద్ద అక్రమాలకు 'సైలెంట్ అండ'నా?
- టౌన్ ప్లానింగ్‌పై ప్రజల విమర్శలు... ఉన్నతాధికారులు స్పందిస్తారా?

**కూకట్‌పల్లి, మే 21 (జనంసాక్షి):**

*కూకట్‌పల్లి మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. చట్టాలు స్పష్టంగా ఉన్నా, వాటి అమలు విషయంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) పొందిన తర్వాత అదనపు అంతస్తులు నిర్మించడం చట్టపరంగా నేరమని తెలిసినా, బహిరంగంగానే నిర్మాణాలు కొనసాగుతుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది.*

టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం, ఒకసారి ఓసీ జారీ అయిన తర్వాత భవనం శాంక్షన్ చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా ఎలాంటి మార్పులు చేయరాదు. అదనపు అంతస్తులు నిర్మిస్తే అది స్పష్టంగా 'డెవియేషన్' లేదా 'అనధికార నిర్మాణం' కిందకు వస్తుంది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012లోని రూల్ 15, 17 ప్రకారం, అలాంటి నిర్మాణాలపై జరిమానాలు, విద్యుత్ కనెక్షన్ నిలిపివేత, ఆస్తి పన్ను పెంపు, రిజిస్ట్రేషన్ సస్పెన్షన్, అవసరమైతే కూల్చివేత చర్యలు కూడా తీసుకోవచ్చు. మున్సిపాలిటీస్ యాక్ట్-2019 సెక్షన్ 174, 176 కింద కూడా అనుమతి లేని అంతస్తుల నిర్మాణం నేరంగానే పరిగణించబడుతుంది.

అయితే కూకట్‌పల్లి పరిధిలో ఈ నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తులసి నగర్, హైదర్‌నగర్‌లోని ప్లాట్ నెం.8, అడ్డగుట్టలో ప్లాట్ నెం.219సీ, 220సీ, అరుణ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ జయానగర్‌లోని ప్లాట్ నెం.175, గోపాల్ నగర్‌లోని ప్లాట్ నెం.302 వంటి ప్రాంతాల్లో ఎన్ఓసీ పరిమితిని మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేకంగా కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రజల ఫిర్యాదులను పట్టించుకోకుండా, "ఇన్‌వార్డ్ ఇచ్చుకోండి... టైం ఉన్నప్పుడు చూస్తా" అంటూ నిర్లక్ష్యంగా స్పందిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారిగా కాకుండా, అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మరోవైపు, టౌన్ ప్లానింగ్‌లో పనిచేస్తున్న 'న్యాక్ టీమ్' పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన ఈ బృందం, కొన్నింటిపైనే అకస్మాత్తుగా దాడులు చేసి, మరికొన్నింటిని పూర్తిగా విస్మరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. "చెల్లిస్తే రక్షణ... లేకపోతే డెమోలిషన్" అన్న అభిప్రాయం స్థానికుల్లో బలపడుతోంది. చిన్నపాటి నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తూ, కోట్ల విలువైన పెద్ద అక్రమ నిర్మాణాలను మాత్రం ముట్టుకోకపోవడం వెనుక వసూళ్ల కోణం ఉందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

స్థానికుల మాటల్లో, "పేదవాడు ఒక గది కడితే వెంటనే నోటీసు... పెద్ద బిల్డర్ అదనపు ఫ్లోర్ వేస్తే మౌనం. ఇదేనా చట్టం ముందు సమానత్వం?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ వ్యవస్థలో డబుల్ స్టాండర్డ్ కొనసాగుతోందని మండిపడుతున్నారు.

ఈ వ్యవహారంపై స్పందించిన సెక్షన్ ఆఫీసర్ మధు, "ప్లాట్ నంబర్లు వివరంగా తెలపండి... వెంటనే చర్యలు తీసుకుంటాం" అని చెప్పినట్లు సమాచారం. అయితే ఇదే హామీ పలుమార్లు ఇచ్చినా, గ్రౌండ్ లెవెల్‌లో ఒక్క నిర్మాణంపైనా స్పష్టమైన చర్యలు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. "మాటలు ఒకటే... చర్యలు జీరో" అన్న అభిప్రాయం బలపడుతోంది.

అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడమే కాకుండా, నగర అభివృద్ధి నియమాలు కూడా పూర్తిగా ధ్వంసమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓసీ తర్వాత అదనపు అంతస్తులు నిర్మించడం కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదు, భవన భద్రతపైనా తీవ్రమైన ముప్పు అని గుర్తుచేస్తున్నారు.

కూకట్‌పల్లిలో జరుగుతున్న ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలంటే పారదర్శకత, సమానత్వం, కఠిన అమలు తప్పనిసరని చెబుతున్నారు. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే- చట్టం నిజంగా మేల్కొంటుందా? లేక అక్రమాలకు సైలెంట్‌గా అండగా నిలుస్తుందా?





## ఐటీ విప్లవ ప్రదాత రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తాం: మోటే శ్రీశైలం

### యాచారంలో ఘనంగా మాజీ ప్రధాని 35వ వర్ధంతి వేడుకలు.. శ్రేణులతో కలిసి నివాళులు



**యాచారం, మే 21(జనం సాక్షి )** భారత రత్న, దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలను యాచారం మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మోటే శ్రీశైలం మాట్లాడుతూ.. కేవలం 40 ఏళ్ల చిన్న వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, భారతదేశాన్ని ఐటీ, టెలికాం రంగాలలో ప్రపంచ అగ్రగామిగా నిలిపిన ఘనత రాజీవ్ గాంధీదేనని కొనియాడారు. యువతకు ప్రాధాన్యత ఇస్తూ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించారని, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన మహోన్నత నాయకుడని గుర్తుచేశారు. "యువతే దేశ భవిష్యత్తు" అని నమ్మిన ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కేశమోని రాజు గౌడ్, కిషన్ నాయక్, సంగం చైతన్య రాజు, నరేందర్ రెడ్డి, అచ్చన మంగ జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మస్కు నరసింహ, గులాం అక్బర్, యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జయప్రకాష్, మదర్ డైరీ డైరెక్టర్ జంగయ్య, సీనియర్ నాయకులు లిక్కి పాండురంగారెడ్డి, ఉపసర్పంచులు మధుకర్ రెడ్డి, శ్రీకాంత్, మరియు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హామీలను విస్మరించి ఫార్మా సిటీ కోసం రైతులను వేధిస్తున్న ప్రభుత్వం

### ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి



**యాచారం,మే 21(జనం సాక్షి )** ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ఫార్మా సిటీని రద్దు చేయకుండా రైతులను వేధిస్తోందని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మేడిపల్లి గ్రామంలో కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు, రైతు కూలీలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవుల సరస్వతి, రైతులు మాట్లాడుతూ.. కోర్టు స్టే ఉన్న పట్టా భూముల్లో కూడా ప్రభుత్వం అక్రమంగా మెషిన్లు తెచ్చి చదును చేస్తోందని ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు కుంరెడ్డి యాదవ్ రెడ్డి భూమిని అధికారులు చదును చేస్తుండగా, రైతులందరూ ఒకతాటిపైకి వచ్చి పనులను అడ్డుకున్నట్లు తెలిపారు. కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు తమను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోతున్న రైతు కూలీలు: భూములు కోల్పోతే తమ బతుకులు రోడ్డున పడతాయని రైతు కూలీలు వాపోయారు. ఫార్మా సిటీ భూసేకరణ వల్ల ఇప్పటికే స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని, పూర్తి స్థాయిలో భూములు లాక్కుంటే తమ గతి ఏంటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వందలాది మంది రైతులు, కూలీలు "ప్రభుత్వ చట్టవ్యతిరేక పనులు నశించాలి", "ఫార్మా జీవోను తక్షణమే రద్దు చేయాలి", "మా భూములు మాకు కావాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఇంటికో రైతు కదలాలి -- కమిటీ తీర్మానం:ఫార్మా సిటీకి వ్యతిరేకంగా చేపట్టబోయే తదుపరి కార్యాచరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుండి ఎంతమంది వీలైతే అంతమంది రైతులు పోరాటంలోకి రావాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమం లో ఫార్మా సిటీ వ్యతిరేక కమిటీ సభ్యులు కల్లు కొండల్ రెడ్డి, పాండురంగచారి, అచ్చి రెడ్డి, కనేమోని గణేష్, గడ్డం కుమార్, ఆరెపల్లి లింగం, వెంకటేశం గౌడ్, బొగ్గుల పాపి రెడ్డి, మహిపాల్ రెడ్డి, గడ్డం రవీందర్, జోగు సత్తయ్య మరియు గ్రామ రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రీన్ ఫార్మాసిటీ' పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన టీజీ ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్



**యాచారం, మే 21(జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ టీజీ ఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్, యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన 'గ్రీన్ ఫార్మాసిటీ' పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని గురువారం ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, గ్రీన్ ఫార్మాసిటీ పరిధిలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల అత్యాధునిక హంగులు, అధునాతన సాంకేతిక వసతులతో ఈ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఈ నూతన స్థలానికి సమీపంలోనే ప్రతిష్టాత్మక 'గ్రీన్ ఫీల్డ్ రోడ్' నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో పోలీస్ స్టేషన్ విధులకు మరియు ప్రజా రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి అనంతరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజు, యాచారం మండల తహసిల్దార్ అయ్యప్ప, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యుడిపై భారాలు మోడీ ప్రభుత్వంపై డా. సత్యం శ్రీరంగం ఫైర్




**కూకట్ పల్లి మే 21(జనంసాక్షి ):** ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాలు మోపిందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విమర్శించారు. గాంధీ భవన్‌లో జరిగిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ, ముడి చమురు ధరలు తగ్గినా ఎక్సైజ్, సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందన్నారు. యూపీఏ హయాంలో అంతర్జాతీయంగా ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలపై భారం వేయలేదని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రచారంలో చెప్పిన అభివృద్ధి వాస్తవానికి విరుద్ధమని, దేశ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోందన్నారు. రూపాయి విలువ పడిపోవడం, ఆర్థిక వ్యవస్థ బలహీనతకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజలపై భారాన్ని మోపుతూ బాధ్యత తప్పించుకుంటోందని మండిపడ్డారు.

### ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్

## నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షులుగా కట్కం వీరేందర్, కార్యదర్శిగా దర్మిది ప్రభు



**తాండూరు మే 21జనంసాక్షి)** ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2026-28 సంవత్సరానికి గాను ఎన్నికలు జరిగాయి. ఇందులో 15 మంది డైరెక్టర్లు ఎన్నికయ్యారు. వారిలో దివంగత నాగారం నర్సింలు పేరుతో కూడిన ప్యానల్‌లోని డైరెక్టర్లు అత్యధికంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులుగా కట్కం వీరేందర్, ఉపాధ్యక్షులుగా బానకారి క్రిష్ణ, కార్యదర్శిగా దర్మిది ప్రభు, సహ కార్యదర్శులుగా నాగారం జగదీశ్వర్, కోశాధికారిగా సిహెచ్ భోజిరెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎన్. జైపాల్ రెడ్డి, కల్వ రాధాకృష్ణ, బంటారం సుధాకర్, చామ్‌కూర్ విశ్వనాథ్, బిక్కుమల్ల శ్రీధర్, రాజేష్ సోని, దీనేష్ సింగ్, మంకాల రవీందర్, టి.బాలేశ్వర్ గుప్త, మల్లేపల్లి మధుసూదన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా ఎన్నికల అధికారి కుంచెం మురలీధర్ అధ్యక్ష, కార్యదర్శులకు, సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షులు కట్కం వీరేందర్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని తెలిపారు. అనంతరం పలువురు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## దేశంలో ఐటీ రంగానికి పునాది వేసిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ



**పెద్దేముల్:మే 21(జనంసాక్షి)** దేశంలో ఐటీ రంగానికి పునాది వేసి,18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ. ఆయన దార్శనికతే నేటి ఆధునిక భారతదేశానికి బాటలు వేసింది ఆయనే అని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. మహిపాల్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు కలిసి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి మహిపాల్ రెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు,పి.మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ:. 40 ఏళ్ల వయసులోనే దేశ ప్రధాని అయిన రాజీవ్ గాంధీ , 21వ శతాబ్దపు భారత్‌ను ఊహించారు. కంప్యూటర్లు అంటే ఏంటో తెలియని రోజుల్లో దేశంలో టెలికాం, కంప్యూటర్ విప్లవానికి తెరలేపారు. ఈరోజు ప్రపంచంలో భారత్ ఐటీ హబ్‌గా మారిందంటే దానికి ఆయనే పునాది. ప్రతి చేతిలో సెల్‌ఫోన్, ప్రతి ఇంట్లో కంప్యూటర్ ఉందంటే అది రాజీవ్ గారి దూరదృష్టి ఫలితమేఅని అన్నారు. అంతేకాదు, 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి దేశంలోని కోట్లాది మంది యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి, మహిళలకు స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ఆయనదే. నవోదయ విద్యాలయాలతో గ్రామీణ ప్రతిభకు ఊతమిచ్చారు అని గుర్తుచేశారు. దేశ సమగ్రత,ఐక్యత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలి. ఆయన కలలుగన్న ఆధునిక, శక్తివంతమైన భారత్ నిర్మాణంలో భాగస్వాములవుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు వారు. డిసిసి. ఉపాధ్యక్షురాలు శోభారాణి,కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, టిపిసిసి. మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జితేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, నల్ల ఎల్ల రెడ్డి, కోహీర్ రవిశంకర్,తింసాన్ పల్లి,సర్పంచ్ గుడిసె. చంద్రకళ. నగులపల్లి సర్పంచ్ నాగిరెడ్డి, తట్టే పల్లి సర్పంచ్ నారాయణ్ గౌడ్, జనగం సర్పంచ్ అరుణ, సిదన్నమద్దు తండ సర్పంచ్ విజయ్, గోపాల్ పూర్ ఉప సర్పంచ్ జైపాల్ రెడ్డి,నాయకులు లాల్ రెడ్డి, మారేపల్లి వెంకటేష్, డాక్టర్ రమేష్, ఎర్ర బలాప్ప. బుజ్జమ్మ, మాంబాపూర్ శ్రీనివాస్ రెడ్డి, కే నర్సింలు, డివై నర్సింలు, ఆనంద చారి, ఇక్బాల్ .సాబేర్, మైఫుజ్, రామ్ శెట్టి, చందు, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాలు

- రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ వెంకట్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకుల నివాళులు
- ఆధునిక భారత నిర్మాత ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకుల పిలుపు



**ఉప్పల్, మే 21 (జనం సాక్షి):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్, వెంకట్ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, ఎస్సి సెల్, బిసి సెల్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రామంతాపూర్‌లో జరిగిన ప్రధాన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ గారి సేవలను స్మరించుకుంటూ నాయకులు ప్రత్యేక సభ నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లు, రాజీవ్ గాంధీ చిత్రాలతో అలంకరించబడగా, కార్యకర్తలు "జోహార్ రాజీవ్ గాంధీ", "రాజీవ్ గాంధీ అమర్ రహే" అంటూ నినాదాలతో ప్రాంతాన్ని మారుమోగించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆధునిక భారతదేశానికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. భారతదేశాన్ని 21వ శతాబ్దంలో సాంకేతిక రంగంలో ప్రపంచానికి పోటీగా నిలిపే దిశగా ముందుచూపుతో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి శ్రీకారం చుట్టిన మహానేత రాజీవ్ గాంధీ అని, గ్రామీణ ప్రాంతాలకు సైతం సాంకేతికతను తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేశారని తెలిపారు. టెలికాం రంగ అభివృద్ధి, సమాచార విప్లవం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. దేశ యువత రాజకీయాల్లోకి రావడానికి అవకాశం కల్పించిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ కలల భారతదేశ నిర్మాణమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతుందని తెలిపారు. అదేవిధంగా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లోని రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ సమీపంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరో ఘన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందుముల పరమేశ్వర్ రెడ్డిని యువనాయకుడు, ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాయకులు కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. హబ్సిగూడ, చిలుకానగర్, వెంకట్ రెడ్డి నగర్ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు జలీల్ భాష, ఉపేందర్ రెడ్డి, బాలయ్య, కిషోర్, రఘు, ప్రకాష్, భాను, భాస్కర్, కనకయ్య, సిద్ధులు, మల్లయ్య, రంజిత్ రెడ్డి, జలంధర్ రెడ్డి, కొండ నాగరాజు, సంపత్, గోవింద్ కృష్ణ గౌడ్, స్వామి, అలీ పాషా, నవీన్, అశోక్, లక్ష్మి, ధనలక్ష్మి, పావని, దామోదర్, అరవింద్, తోట రాజేష్ తదితరులు పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం ముగింపులో దేశ సమగ్రాభివృద్ధి, యువత సాధికారత, సాంకేతిక పురోగతి కోసం రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

# ఉప్పల్‌లో ఐపీఎల్ టికెట్ల పేరుతో సైబర్ మోసాలు

## ప్రజలకు మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరిక



ఉప్పల్, మే 21 (జనం సాక్షి): ఉప్పల్‌లో మే 22న జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ -- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ మ్యాచ్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారని మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికల ద్వారా నకిలీ టికెట్ బుకింగ్ లింకులు వైరల్ అవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మోసగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి "వి ఐ పి టికెట్లు", "తత్కాల్ బుకింగ్", "లాస్ట్ మినిట్ టికెట్లు", "తక్కువ ధరలో టికెట్లు" అంటూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. అత్యవసరంగా టికెట్లు కావాల్సిన అభిమానులను లక్ష్యంగా చేసుకుని ఫేక్ లింకులు పంపిస్తూ యూపీఐ చెల్లింపులు, క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. టికెట్లు అయిపోయాయని ప్రచారం చేస్తూ, "మా దగ్గర మాత్రమే అందుబాటులో ఉన్నాయి" అంటూ నకిలీ స్క్రీన్‌షాట్లు, ఫేక్ పేమెంట్ రసీదులు చూపించి ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని పోలీసులు వెల్లడించారు. కొందరు నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు కూడా ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అధికారిక టికెట్ బుకింగ్ వేదిక "డిస్ట్రిక్ట్ బై జొమాటో" యాప్ మాత్రమేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులను ఓపెన్ చేయకూడదని, అనుమానాస్పద క్యూఆర్ కోడ్లు స్కాన్ చేయవద్దని, వ్యక్తిగత యూపీఐ ఖాతాలకు డబ్బులు పంపరాదని ప్రజలకు సూచించారు. టికెట్ బుకింగ్ చేసే ముందు అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్ నిజస్వరూపాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని, తక్కువ ధరల పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

# ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్‌లో పోలీసుల ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం




**ఉప్పల్ మే 21,( జనం సాక్షి ):** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్‌లో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "మీ సురక్ష -- మీ భద్రతే మా ప్రాధాన్యత" అనే నినాదంతో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు రాయల్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కాలనీవాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం నగర పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న నేరాలు, చోరీలు, ఆకతాయిల వేధింపులు, సైబర్ మోసాల నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో నివసించే ప్రతి కుటుంబం తమ పరిసరాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రెంటర్లు, గృహ కార్మికులు (డొమెస్టిక్ వర్కర్స్), సెక్యూరిటీ గార్డ్స్ మరియు ఇతర సేవా సిబ్బంది పూర్తి వివరాలను పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమాచారం నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు జరిగినా త్వరగా విచారణ జరిపి సమస్యలను పరిష్కరించడానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రతి అపార్ట్‌మెంట్, ప్రతి కాలనీ పోలీస్ శాఖతో సమన్వయం కలిగి ఉంటే నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఏసీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఆకతాయిల గుంపులు తిరగడం, బైక్ రైడర్లు అధిక వేగంతో హల్‌చల్ చేయడం, రోడ్లపై మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొంతమంది యువకులు అర్ధరాత్రి వరకు పెద్ద శబ్దాలతో వాహనాలు నడపడం వల్ల ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై స్పందించిన ఏసీపీ వెంకట్ రెడ్డి, కాలనీలో ప్రత్యేక పహారా బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి సమయంలో మరింత నిఘా పెంచుతామని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే సీసీ కెమెరాల ఏర్పాటు, బీట్ పోలీసింగ్ బలోపేతం వంటి చర్యలు కూడా చేపడతామని తెలిపారు. అదేవిధంగా ప్రజలు కూడా ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ప్రజలకు పలు భద్రతా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఐ రవికుమార్, ఉప్పల్ ఎస్సై మాధవ రెడ్డి, భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, మహిళలు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కాలనీవాసులు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలను అభినందించారు. "ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం" అని పోలీసులు పిలుపునిచ్చారు.

# కులగణన నిర్వహణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ హర్షణీయం

- బీసీ ఉద్యమాలకు సుప్రీం కోర్టు తీర్పుతో కొత్త ఊపు.
- కుల గణనతోనే బీసీలకు సంపూర్ణ న్యాయం.
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్.



**తాండూరు మే 21(జనంసాక్షి)** దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు మరియు తాండూర్ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాలకు కొత్త ఊపు తీసుకువచ్చిందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు బీసీల అసలైన జనాభా లెక్కలు బయటకు రాకపోవడం వల్ల విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల విషయంలో బీసీలు అనేక అన్యాయాలకు గురయ్యారని తెలిపారు. కుల గణనతోనే బీసీలకు సంపూర్ణ న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు సేకరించడం అత్యంత అవసరమని కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. కుల గణన ద్వారా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తేనే ప్రభుత్వాలు బీసీలకు తగిన విధానాలు, అవకాశాలు, రిజర్వేషన్లు కల్పించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కుల గణన వ్యతిరేకులకు సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సామాజిక న్యాయం సాధించే దిశగా సుప్రీం కోర్టు తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. జనగణన లో సమగ్ర కుల గణన తప్పనిసరిగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీల అసలైన జనాభా లెక్కలు బయటపడే సమయం ఆసన్నమైందని, రాబోయే రోజుల్లో బీసీలకు న్యాయం జరిగే దిశగా ఇది కీలక అడుగని పేర్కొన్నారు.

# తమ్మలోనిగూడలో ఉపాధి పనుల తనిఖీ



**యాచారం, మే 21(జనం సాక్షి )** యాచారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గురువారం యాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధారాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల హాజరు, పనుల నాణ్యతను తనిఖీ చేసిన ఆమె, వేసవి నేపథ్యంలో కూలీల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల కొలతలను, రికార్డులను నిశితంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు వడదెబ్బ తగలకుండా పని ప్రదేశంలో గ్రీన్ షెడ్స్, చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఉదయాన్నే పనులకు హాజరై, ఎండ ముదరకముందే ఉదయం 10:30 గంటల కల్లా పనులను పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.సకాలంలో వేతనాలు: ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ రికార్డులను సకాలంలో ఆన్‌లైన్ చేసి, కూలీల ఆధార్ అనుసంధాన బ్యాంక్ ఖాతాల్లోకి వేతనాలు త్వరగా జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దెంది రామిరెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## వాక్ ఫర్ వాటర్ రిజర్వాయర్ల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం



రాజేంద్రనగర్,మే21(జనంసాక్షి) వాక్ ఫర్ వాటర్ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా బీఆర్ఎస్ స్థానిక నాయకులు గురువారం ఎల్ఐసీ కాలనీ శ్మశానవాటిక వద్ద ఉన్న 1 ఎంఎల్‌డీ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రూ.3.68 కోట్ల వ్యయంతో 2014లో ప్రారంభించిన ఈ రిజర్వాయర్ ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్కాపూర్ స్పోర్ట్స్ పార్క్‌లోని 2.5 ఎంఎల్‌డీ రిజర్వాయర్ ద్వారా రెండు రోజుల పాటు మాత్రమే నీటి సరఫరా చేసి అధికారులు చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపించారు. పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడం లేదన్నారు. రిజర్వాయర్ల ద్వారా నీటి సరఫరా చేయకుండా ట్యాంకర్ల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ నీటిని పంపిణీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కృష్ణారెడ్డి కాలనీలోని 1 ఎంఎల్‌డీ రిజర్వాయర్ పూర్తిగా నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, గోరుకంటి విఠల్, షేక్ ఆరిఫ్, భాను చందర్, సుమనళిని, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



**మల్కాజిగిరి మే 21(జనంసాక్షి)** భారతదేశ సాంకేతిక, సమగ్ర అభివృద్ధికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మౌలాలి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కే. శీను, పోతుల వినోద్ యాదవ్, సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, శ్రీకాంత్ ముదిరాజ్, వెంకన్న, చంద్రశేఖర్, ప్రసాద్, అరుణ్ గౌడ్, హమీద్, అలిజన్, యూసుఫ్, దైవసాయం, ఫరూక్, భాస్కర్, సుంకు శ్రీనివాస్, చందు, ముత్తార్, షకీల్, మల్లేష్, నర్సింగ్ రావు, యాకూబ్, రైముద్దీన్, కృష్ణ, భీమ్రాజ్, మాజిద్, మైముద్దా, రోజమ్మ, చరణ్, అజయ్, అజయ్ రాజ్, లక్ష్మణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యకు వినతి

**మోమిన్ పేట మే 21 (జనం సాక్షి)** మోమిన్ పేట మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించినటువంటి వరి ఇతర ధాన్యాన్ని సకాలంలో ప్రభుత్వం ధాన్యం సేకరించి రైతులకు మద్దతు ధర ప్రకటించి రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ మోమిన్ పేట మండల అధ్యక్షుడు ఆశీ రెడ్డి జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ రాజ్యసభ సభ్యులు టైగర్ ఆర్ కృష్ణయ్యని కలిసి రైతుల సమస్యలను దృష్టికి తీసుకువెళ్లడం ఆర్ కృష్ణయ్య దృష్టికి గురువారం తీసుకువెళ్లారు మండలంలోని వివిధ గ్రామాల రైతులు పడుతున్నటువంటి కష్టాలను వెంటనే రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరడం జరిగినది దీనికి స్పందించి రాజ్యసభ



సభ్యుడు ఆర్ కృష్ణయ్య వెంటనే అధికారులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర అందించే విధంగా వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను ఆదేశించారు

## మూడు కార్పొరేషన్‌ల పరిధిలోని కార్మికులకు ఒకే రకమైన వేతనాన్ని అమలు చేయాలి

### జాజాల రుద్రకుమార్, ఆలేటి ఎల్లయ్య



**హయత్ నగర్, మే 21 (జనం సాక్షి)** జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్. జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మనసురాబాద్ చౌరస్తా లో జిహెచ్ఎంసి కార్మికులతో సిఐటియు హయత్ నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశాన్ని కార్మికులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు కార్పొరేషన్ లో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ మల్కాజ్ గిరి లలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే రకమైన వేతన ఉండాలని అన్నారు. జిహెచ్ఎంసి కార్మికులను, సూపర్వైజర్లను పర్మినెంట్ చేయాలని, లేనియెడల కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వారు తెలిపారు. సూపర్వైజర్లకు 30,000 వేతనం, 3000 పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులకు 25 లక్షలు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, 60 సంవత్సరాలు వయసు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు, వారసులు లేని వారికి 15 లక్షల రూపాయలు ఇవ్వాలని, మరణించిన కార్మికుని దాన సంస్కారాలకు 30,000 వేలు మట్టి ఖర్చులు ఇవ్వాలని వారు కోరారు. ఆదివారాలు, పండగ సెలవులు, వారంతపు సెలవులు, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, మూడు కార్పొరేషన్ పరిధిలో ఎస్ ఎఫ్ ఏ లకు, జవాన్లకు వర్క్ ఇన్స్పెక్టర్ లకు ప్రమోషన్లు కల్పించాలి, సూపర్వైజర్ లేని గ్రూపులకు వెంటనే సూపర్వైజర్ నియమించాలి, సూపర్వైజర్లు చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి సూపర్వైజర్ ఉద్యోగం ఇవ్వాలి, మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతనిచ్చి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి, బయోమెటిక్ అటెండెన్స్ విధానంలో మార్పులు చేయాలి, పని ప్రదేశాల వద్దనే టైం హాజరు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు, సూపర్వైజర్ లు ఐక్యంగా పోరాటం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాలమ్మ, లక్ష్మమ్మ, అండాలు, రజిత, పుష్ప, మంజుల, వెంకటమ్మ, మహేష్, గౌరమ్మ, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ఉద్యోగులకు ఆరోగ్య భీమా కల్పించడం హర్షనీయం: ఓయూ వీసీ

**సికింద్రాబాద్(జనంసాక్షి):** యూనివర్సిటీ ఉద్యోగులకు ఆరోగ్య భీమా (ఈహెచ్ఎస్) వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వేలాది ఉద్యోగుల, పెన్షనర్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సంక్షేమ పాలనలో ఒక కీలక ఘట్టమని కుమార్ అభివర్ణించారు. ఉద్యోగుల ఆరోగ్య రక్షణ కోసం నూతన ఆరోగ్య పథకాన్ని అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహ కి వీసీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ద్వారా ఓయూలోని 328 మంది బోధనా సిబ్బంది, 1,145 మంది బోధనేతర సిబ్బంది, దాదాపు 3,500 మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భీమా వర్తించనుందన్నారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులను కూడా పథకంలో చేర్చడం ప్రభుత్వం సామాజిక భద్రతకు ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తోందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖ జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల మేరకు ఈ పథకం అమలుకు విశ్వవిద్యాలయ యంత్రాంగం వేగంగా చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు మే 31లోపు అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ వివరాలను సేకరించి ఐఎఫ్ఎంఐఎస్–హెచ్ఆర్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

# బోడుప్పల్లో ఘనంగా రాజీవ్గాంధీ వర్ధంతి వేడుకలు




**బోడుప్పల్–జనంసాక్షి** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, సీనియర్ నాయకులు రాపోలు రాములు, కొత్త కిషోర్ గౌడ్, కొత్త చందర్ గౌడ్, రాపోలు శంకరయ్య, పొద్దుటూరి నర్సింగరావు గుప్తా, పి.హరినాథ్ రెడ్డి, కుర్ర శివశంకర్, పులకండ్ల జంగారెడ్డి, కొత్త ప్రభాకర్ గౌడ్, యాదగిరి, మోదుగశేఖర్రెడ్డి, గుర్రాల వెంకటేశ్ యాదవ్, చీరాల జంగయ్య, దానగల్ల యాదగిరి, జక్క రాములు, బొమ్మకు రమేశ్.గందె విశ్వం గుప్తా,వి రాచారి, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కల్యాణ్ కుమార్, భూక్య సుమన్ నాయక్. యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దుల శ్రీకాంత్ యాదవ్, పడతం లోకేశ్, అరవింద్ గౌడ్, పోగులదిలీప్ రెడ్డి, తోటకూర రాజు యాదవ్, సింగిరెడ్డి రాజు రెడ్డి. రాహుల్,మహిళా కాంగ్రెస్ నాయకురాలు సమత యాదవ్ లతో పాటు అనే కమందికార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు.

## తిరుపతి-చర్లపల్లి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**సికింద్రాబాద్(జనంసాక్షి):** దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి-చర్లపల్లి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టింది. రైల్వే మంత్రిత్వ శాఖ అనుమతితో ట్రైన్ నంబర్లు 17443/17444 కింద ఈ రెగ్యులర్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ట్రైన్ నెం.17443 తిరుపతి--చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి గురువారం సాయంత్రం 4:30 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 8:25 గంటలకు చర్లపల్లి చేరుకోనుంది. ఈ సర్వీస్ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుంది. అలాగే ట్రైన్ నెం.17444 చర్లపల్లి--తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం ఉదయం 7:30 గంటలకు తిరుపతి చేరుకోనుంది. ఈ సర్వీస్ ఈ నెల 29 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, దిగువమెట్ట, గిద్దలూరు, మార్కాపురం రోడ్, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగనుంది. ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ రైలులో 1 సెకండ్ ఏసీ, 3 థర్డ్ ఏసీ, 14 స్లీపర్, 4 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## ఓయూ సీఈ -స్మార్ట్‌బ్రిడ్జ్ మధ్య అవగాహన ఒప్పందం

### విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లు




**సికింద్రాబాద్(జనంసాక్షి):** విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జ్ సంస్థ అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లు, అనుభవాత్మక అభ్యాస (ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్) కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఒప్పందం ఓయూ సీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సిద్ధాంతపరమైన విద్యతో పాటు ప్రాయోగిక అనుభవాన్ని అందించడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారు సిద్ధమవుతారని పేర్కొన్నారు. స్మార్ట్‌బ్రిడ్జ్ వ్యవస్థాపకుడు, సీఈఓ కె. అమరేందర్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించే ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్మార్ట్‌బ్రిడ్జ్ తరఫున వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్) ఎస్. శ్రీదేవి, లీడ్ యాక్సిలరేటర్ (రోబోటిక్స్ ఐఓటీ) డా. డి. నరేందర్ సింగ్ పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు ఆపన్న హస్తంగా ఆదుకుంటున్న శ్రీకాంత్ రెడ్డి



**మర్పల్లి మే 21 (జనంసాక్షి)** ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు ఆపన్న హస్తంగా ఆదుకుంటున్న రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి. గురువారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని కల్కొడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులు ఇటీవల కాలంలో 10 మంది వరకు ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుంకి సూర్య కళ రాములు, మాజీ సర్పంచ్ శివకుమార్, పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 5000/- వేల రూపాయలను బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఎల్లప్పుడూ కార్యకర్తలు కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పసుల శ్రీ విద్య వెంకటేష్, యూనుస్, శ్రీనివాస్, బాలరాజ్, యూనుస్, సంజీవులు, రత్నం, పెద్దెముల్, శ్రీనివాస్, ఆశన్న, అప్సర్, పద్మారావు, సుదర్శన్, రాములు, గూడు పాషా, జామీర్ మజీద్, బాలయ్య, చెక్క శ్రీనివాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## పేదల కోసమే ప్రభుత్వ పథకాలు

### ఏఎంసి చైర్మన్ నర్సింలు యాదవ్



**శామీర్ పేట, మే 21(జనం సాక్షి )** మూడుచింతల పల్లి మున్సిపాలిటీలోని అనంతరం గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు దండు యాదమ్మ పోచయ్యకి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు, మూడుచింతల పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశంతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాపిరెడ్డి, మల్లేశం, బసవ రెడ్డి టెంపుల్ చైర్మన్ వెంకటగిరి ప్రసాద్,, అఖిలేష్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపయోగకరం

### మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



హయత్ నగర్, మే 21 (జనం సాక్షి) నాగోల్ అల్కాపురి ఎక్స్ రోడ్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఐఎఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరై, కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజా అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఎంపీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కాలనీల్లో సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపయోగకరమని కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక సంస్థల సమన్వయంతో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు ఈటల రాజేందర్ కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ అధికారులు, ఎల్బీనగర్ నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు , కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వేరు

### నిర్మించడానికి ప్రభుత్వం ముందడుగు



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీ దేవిపల్లి రిజర్వేర్ చెప్పటలని ప్రభుత్వం భావించిందని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షుడు కోమరు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇర్దయం తీస్కొని త్వరలో సర్వే పనులు చెప్పటంటెందుకు సుముఖాత చూపారు. ఇక్కడ రైతులకు కావలసింది ముఖ్యం నీరు కాబట్టి వ్యవసాయం చేసుకోవాలంటే బోర్ వేయాలి అది వేసినంక నీరు రాకుంటే రైతు కంట్లో కన్నీరే చూడాలి. అదే గమనించిన ప్రజాప్రభుత్వం త్వరగా రిజర్వేర్ పనులు చేపట్టి రైతు కన్నీరు తుడువనుంది లక్ష్మీ దేవిపల్లి రిజర్వయార్ పనులు చెప్పటలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన షాద్నగర్ మ్మెల్యే వీర్లపల్లిశంకర్ పై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని యూత్ ప్రెసిడెంట్ కుమార్ పేర్కొన్నారు.

## దేశానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

### జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి



**శామీర్ పేట్, మే 21(జనం సాక్షి )** మాజీ ప్రధాన మంత్రి,భారత రత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్,శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లో ఘన నివాళి కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించు కున్నారు.భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించిన దూరదృష్టి నాయకుడి గా ఆయనను కొనియాడారు. ముఖ్యంగా కంప్యూటర్, టెలికాం రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడిగా గుర్తుచేశారు.యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి,భారత భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. 18 సంవత్సరాల వయస్సు వచ్చిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచారని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చిన రాజీవ్ గాంధీ, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పరిపాలనలో మహిళల పాత్రను బలపరిచారని అన్నారు.మహాత్మా గాంధీ, ఇందిరాగాంధీ వంటి మహానాయకుల స్ఫూర్తితో దేశ సమగ్రత,అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాల స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమా లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పి.బాలేష్,మాజీ ఉపసర్పంచ్ టి.శంకర్ గౌడ్,శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ పి.లక్ష్మీనారాయణ,మాజీ ధర్మకర్తలు వి.మురళి గౌడ్,బి.కొండల్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు బి.జనార్దన్ రెడ్డి,యస్.వేణుగోపాల్‌రెడ్డి,కె.రాము,యం.సాయికుమార్,యస్.ఆనంద్,సి.బిక్షపతి, బి.భూపాల్ రెడ్డి, కె.లక్ష్మణ్,జి.బాబు, బి.మధుసూదన్ రెడ్డి,సి.మణిదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో కులగణన చేపట్టాలన్న సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం స్వాగతిస్తుంది



**మొయినాబాద్,మే21, జనంసాక్షి:** జనగణన ప్రక్రియలో కుల గణన కూడా చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని సామాజిక, ఆర్థిక, అసమానతలను సరి చేయడానికి కులగణన అత్యంత అవసరం అని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కుల గణన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సామాజిక న్యాయం సాధనకు కులగణన కీలకమని స్పష్టం చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రతిపాదికన న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని కాంగ్రెస్ పార్టీ అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరం పోరాడుతుందన్నారు. తెలంగాణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నాయకుల సమన్వయంతో చేపట్టిన కుల సర్వే విజయవంతం అయిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా శాస్త్రీయ వద్దతిలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమ ఫలాలు సరైన వంపిణీ కోసం కుల గణన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కుల సర్వే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోని దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని నిర్ణయించాలని కోరారు.

## అకాల వర్షం తీవ్ర నష్టం



**ధారూర్ మే 21(జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండలంలో గురువారం కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు.గట్టే పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంకు రైతులు తరలించిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది.తేమ శాతం ఎక్కువగా ఉందని నిర్వాహకులు పేర్కొనడంతో రైతులు ధాన్యంని ఆరబెట్టారు.అకాల వర్షానికి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి.ఆరబెట్టిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది.ధాన్యం సంచులు తడిసిపోయాయి.కేంద్రంలో కొనుగోళ్ల జాప్యం వల్ల ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తడిసిముద్దయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం.అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు తడిసిన ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**ధారూర్ మే 21(జనంసాక్షి)** గురువారం నాడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భారతరత్న. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాన్సింగ్. కోల్కొంద సంతోష్.మాజీ జెడ్పిటిసి రాములు.డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్.ఏఎంసీ డైరెక్టర్ పటేల్ అమరేశ్వర్.ధారూర్ టౌన్ అధ్యక్షులు కల్వ కిరణ్. మహమ్మద్ దావుద్.కాంగ్రెస్ పార్టీ అభిమానులు.కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలిస్టేషన్ ఆకస్మాతుగా తనిఖీ

### చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జ్యోషి

### పుష్పగుచ్చం అందించిన ఎస్సై విజయ్



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** పోలిస్టేషన్‌నీ ఆకస్మాతుగా తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జ్యోషి ఇందులోభాగంగా పోలీసుల పనితీరు, పరిసరాలు, రికార్డుల నిర్వహణ పరిశీలించి సిబందికితాగు సూచనలు ఇచ్చారు.

# సాంకేతిక విప్లవ కారకుడు

### గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్



**షాబాద్, మే 21(జనం సాక్షి) ;** దేశాన్ని నూతన పథంలో నడిపించేలా దిశా నిర్దేశం చేసి యువతరంలో శక్తివంతమైన మార్పును ఆకాంక్షించి కంప్యూటర్ యుగానికి నాంది పలకడంతో దేశం ప్రగతి దిశలో పయనిస్తుందన్నారు. మండల పరిధిలోని పార్టీ కార్యాలయంలో గురువారం రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. దేశ రాజకీయాల్లో యువత ప్రాధాన్యం పెరగడానికి ఓటు వేసే కనీస వయసు 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు మార్చి వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనం కలిగేలా జాతీయ విద్యా విధానాన్ని విస్తరించాలనే లక్ష్యంతో జవహర్ నవోదయ విశ్వవిద్యాలయాలను ప్రారంభించి అందరికీ విద్య నందేలా చేశారు. ఈ కార్యక్రమంలో అంతారం సర్పంచ్ ఈగ ప్రబాకర్ రెడ్డి, మిద్దెశీగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, పార్టీ నాయకులు కర్రోళ్ల యాదయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నరసింహ, కృష్ణ, శేఖర్, రవి, సంజీవ, సూర్య, రాజు, సుభాష్ రెడ్డి, టేకులపల్లి రాఘవేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

### కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి



**బోడుప్పల్-జనంసాక్షి** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్,మేడిపల్లి,పీర్జాదిగూడ డివిజన్ లలో భారత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,మహిళా నాయకులు,యూత్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపించిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు.దేశంలో టెలికాం సమాచార సాంకేతిక విప్లవానికి ఆయన పునాది వేశారని తెలిపారు.పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణ జరిపి గ్రామాలకు నేరుగా నిధులు అందేలా చేసిన ఘనత కూడా రాజీవ్ గాంధీదేనని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను దేశానికి ఆయన చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని యువత మరియు కాంగ్రెస్ కార్యకర్తలు దేశాభివృద్ధికి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.పేద వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పని చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జంగచారి,భాస్కర్,రంజిత్ కుమార్ రెడ్డి,కవిడె కుమార్,మోహన్ కుమార్,అడ్వకేట్ నాగరాజు, మహ్మద్ మజర్,బద్రె నాగరాజు,సోమయ్య,శరత్ గౌడ్,కపిల్,మహిళా అధ్యక్షురాలు ఎన్ఎన్‌కే దుర్గా, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గండిగూడ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ట్రక్ డ్రైవర్ మృతి



**శంషాబాద్,మే21(జనంసాక్షి)** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శంషాబాద్ ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం తమిళనాడుకు చెందిన ట్రక్ డ్రైవర్ రామ్‌కుమార్ మురుగేశన్ (43) గండిగూడ వద్ద ఎన్‌హెచ్ 44 రోడ్డును దాటుతుండగా, శంషాబాద్ వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఏపి 39జడ్ 0882 ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బస్సు డ్రైవర్ వి. బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

## హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో కలుషిత నీరు

# అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**హయత్ నగర్, మే 21 (జనం సాక్షి)** హయత్ నగర్ ఓల్డ్ విలేజ్ లోని నక్క బస్తీ తరహాలోనే, రజక బస్తీ ఏరియాలో గత మూడు నెలలుగా తాగునీరు పూర్తిగా కలుషితమై వస్తోందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు మొత్తం మురికిగా, వాసన వస్తూ తాగడానికి వీల్లేకుండా పోయాయని, దీనివల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని బస్తీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.లో-ప్రెషర్ సమస్య గత కొన్ని నెలలుగా నీటి సరఫరా తీవ్రమైన లో-ప్రెషర్ (తక్కువ ఒత్తిడి) తో జరుగుతోంది. చాలా ఇళ్లకు అసలు నీళ్లే రావడం లేదు. వస్తే ఒకటి రెండు బిందెలు, లేదా మహా అయితే పది బిందెల నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. నీళ్లు రాకపోవడంతో కొంతమంది ఇళ్లలో మోటార్లు పెట్టి నీటిని గుంజడం వల్ల, మిగతా సామాన్య ప్రజలకు ఒక్క చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల నుంచి జలమండలి అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి బస్తీవాసుల పిలుపు మేరకు మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి స్వయంగా రజక బస్తీలో పర్యటించారు. కలుషిత నీటిని, లో-ప్రెషర్ సమస్యను ఆయన స్వయంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ జలమండలి సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తానని ఆయన బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి, వెంటనే రజక బస్తీలో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి. కలుషిత నీటి సమస్యను పరిష్కరించి, నీటి ఒత్తిడి పెంచి, బస్తీ ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నాను అని అన్నారు.

## ఆధార్ నమోదు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా పోస్టల్ అధికారి సంపత్ రెడ్డి



**శామీర్ పేట్, మే 21(జనం సాక్షి )** భారత ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో శామీర్ పేట గ్రామంలో గల సబ్ పోస్ట్ ఆఫీస్ నందు ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగినందున మండల ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరని జిల్లా పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శామీర్ పేట్ సబ్ పోస్ట్ ఆఫీస్ అందుబాటులో సేవలు అందిస్తుందని అన్నారు. కొత్త ఆధార్ నమోదు,మొబైల్ నంబర్ అప్డేట్, చిరునామా మార్పు, పేరు, పుట్టిన తేదీ, ఫోటో అప్డేట్,బయోమెట్రిక్అప్డేట్‌కుసంబంధించిన సేవలు ప్రజలకుఅందిస్తుందన్నారు. తీసుకురావలసిన పత్రాలు: పేరు మార్పు:10వ తరగతి మెమో, బర్త్ సర్టిఫికెట్, రాజ పత్రం,పాస్ పోర్ట్, చిరునామా ధృవీకరణకు గ్యాస్ బిల్ / బ్యాంక్ పాస్‌బుక్ / రేషన్ కార్డ్, పుట్టిన తేదీ ధృవీకరణకు బర్త్ సర్టిఫికేట్ / 10వ మార్క్‌షీట్,పాస్ పోర్ట్ పిల్లలకు తల్లిదండ్రుల ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికేట్(తల్లి తండ్రుల ఆధార్ లో ఉన్నట్టుగా పేరు, అడ్రస్ బర్త్ సర్టిఫికెట్ లో ఉండాలన్నారు.5 సంవత్సరాల లోపు పిల్లలకు బయోమెట్రిక్ అవసరం లేదని,అన్ని అప్డేట్‌లకు రుసుము యుఐడిఏఐ నిబంధనల ప్రకారం ఉంటుందని పేర్కొన్నారు. ఒరిజినల్ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని మరిన్ని వివరాలకు సబ్ పోస్ట్ ఆఫీస్ - శామీర్ పేట్ లో సంప్రదించి అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

# హుండీ ఆదాయం లెక్కింపు



**మల్కాజిగిరి మే 21(జనంసాక్షి)** ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు హుండీలోసమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షం లో లెక్కించగా 3,66,693 మూడు లక్షల అరవైఆరు వేల ఆరువందల తొంబైమూడు రూపాయలు 59 రోజుల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి,అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు,డా తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్, గణేష్ హేమంత్ కుమార్, శ్రీకాంత్,అనిత ,పద్మావతి,రత్నమాల,గాంధీ,కెవి ఎస్ ప్రసాద్ ,శ్రీదేవి, మాధవి,వి సరిత, ప్రతిభ, లక్ష్మీ, వరలక్ష్మి,దివ్య,హర్షిత సీతాలక్ష్మి,రామలక్ష్మి ,నారాయణమ్మ, ఎల్లమ్మ, నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి, గంగా,సాయి, తదితర భక్తులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధికి పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, మే 21 (జనం సాక్షి )** నాగోల్ అల్కాపురి ఎక్స్ రోడ్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు నియోజకవర్గాల సమస్యలపై సమీక్ష సమావేశాన్ని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు అంశాలపై ప్రస్తావించారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా బైరామల్ గూడా చెరువు అభివృద్ధికి పూర్తి స్థాయి నిధులు మంజూరు చేయాలని కోరారు. చెరువు అభివృద్ధి పనులకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయం ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.2 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన నిధులను వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హస్తినాపురం జంక్షన్ నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. ఆనంద్ నగర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కల సమస్యపై ప్రత్యేకంగా స్పందిస్తూ, ఇటీవల కుక్కల దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనను ప్రస్తావించారు. స్టెరిలైజేషన్ కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. బి.ఎన్.రెడ్డి నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని సూచించారు. టీకేఆర్ కాలేజ్ సమీపంలో ప్రతిపాదిత ఫ్లైఓవర్ ప్రస్తుతం అవసరం లేదని, ఆ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని కోరారు. బీ.డి.రెడ్డి గార్డెన్ సమీపంలో భూ వివాదాల కారణంగా నిలిచిపోయిన స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హస్తినాపురం డివిజన్‌లోని ద్వారకా తిరుమల నగర్ ప్రాంతంలో ఒక మీటర్ పైప్‌లైన్ విస్తరణ చేపట్టి తాగునీటి సరఫరాను బలోపేతం చేయాలని తెలియజేశారు. మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డు సమీపంలోని పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ కోసం అటవీ శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువుల వద్ద ఎస్టీపీ ప్లాంట్లు ఏర్పాటు చేసి చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖలు ప్రాధాన్యత ఆధారంగా స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను తగ్గించాలి

### బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సింగ్



**ఖైరతాబాద్, మే 21 (జనం సాక్షి) :** పెట్రోల్, డీజిల్ పై వ్యాట్‌ను తగ్గించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సింగ్ రా ష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సామాన్య పౌరు లకు ఎంతో అవసరమైన పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ఉపశమనం కల్పించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం పెట్రో ల్‌పై 35.20 శాతం డీజిల్‌పై 27 శాతం వ్యాట్ విధి స్తోందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే వ్యా ట్ శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఇటీవలి కాలంలో పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని ఇప్పటికే రెండుసార్లు రూ.10 చొప్పున తగ్గించిందని తెలిపారు. పశ్చిమాసియాలో ఇజ్రా యెల్-ఇరాన్ మధ్య యుద్ధం, ఈ సంఘర్షణల ప్ర భావం వల్ల ప్రపంచ ముడి చమురు ధరలు అధికం గా ఉన్నాయన్నారు.ప్రపంచ ముడి చమురు ధరల అస్థిరత నుండి ప్రజలను రక్షించడానికి, ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గించడానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం విధించిన అధిక వ్యాట్ రేట్లు ఇంధన ధరలను అధికంగానే ఉంచుతున్నాయని అన్నారు.ఈ ఉపశమనాన్ని ప్రజలకు కూడా అందించడం రా ష్ట్రాల బాధ్యత రాష్ట్రం కేంద్రం యొక్క ప్రజాహిత విధానాన్ని అనుసరించి, ఆలస్యం చేయకుండా వ్యాట్‌ను తగ్గించాలన్నారు. దీనివల్ల వినియోగదారులకు రెట్టింపు ప్రయోజనం చేకూరుతుందని అ న్నారు. రవాణా ఖర్చులు తగ్గుతాయి, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో సహాయ పడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమానికి, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే విధానాలకు బీజేపీ కట్టుబ డి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాల క న్నా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చి తక్షణ మే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయ కులు ఎన్.బిక్షపతి గౌడ్, కె.దశరథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ స్నేహితుడి ఆరోగ్యం కోసం దేనికైనా సిద్ధమే

### వైద్య ఖర్చులకు రూ.51వేలు అందజేత



**నవాబ్ పేట్ మే 21( జనం సాక్షి)** ఎల్లకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థుల్లో రాజశేఖర్ అనే వ్యక్తికి ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగింది.ఆ సమాచారం అందిన వెంటనే తోటి క్లాస్ మేట్స్ అంతకలిసి 51000వేల రూపాయల రాజశేఖర్ అందజేశారు.ఆ నిధులను వైద్య ఖర్చులకు వినియోగించుకోవాలని,తాము అండగా ఉంటామని ఆయనకు తోటి మిత్రులు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో నవీన్,రాజేందర్,రవీందర్, రాఘవేంద్రర్,నర్సిములు,రాఘవేంద్రర్,రావ ఒకృష్ణ,గిరిబాబు, రాఘవేంద్రర్ రెడ్డి,విఠల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మే 21 (జనంసాక్షి)** దేశ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక రంగ అభివృద్ధితో పాటు గ్రామీణాభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి మరువలేనిదన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింపుల సత్యనారాయణ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, సొసైటీ దేవర వెంకట్ రెడ్డి, కృష్ణ నాయక్, గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మర్పల్లి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, తిప్పని రామ్ రెడ్డి, లోంక శ్రీనివాస్ గౌడ్, పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్, నరేందర్ గౌడ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలోడుతో తిరుగుతున్న టిప్పర్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు



**మర్పల్లి మే 21 (జనంసాక్షి)** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మట్టి లోడ్‌తో తిరుగుతున్న టిప్పర్లు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గ్రామ శివారు ప్రాంతం నుండి మట్టి లోడ్ తీసుకుని రైల్వే స్టేషన్ వరకు వెళ్లే టిప్పర్ల వల్ల రోడ్డంతా దుమ్ముతో నిండిపోతోంది. దీంతో రహదారి పక్కన ఉన్న షాపులపై మట్టి పేరుకుపోతుండగా, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే విధంగా టిప్పర్ల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగిసిపడుతున్న దుమ్ము కళ్లలో పడటంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారిపై ప్రయాణం చేయడం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.అడపాదడపా రోడ్లపై నీళు చల్లుతున్నప్పటికీ దుమ్ము సమస్య మాత్రం తగ్గడం లేదని ప్రజలు అంటున్నారు. టిప్పర్లలో మట్టి తరలించే సమయంలో ఎలాంటి కవర్లు లేకుండా తీసుకెళ్లడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టిప్పర్లపై తప్పనిసరిగా కవర్లు కప్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే దుమ్ము లేవకుండా తరచూ నీరు చల్లడం, నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి: అఫ్జల్ ఖాన్



గురువారం శామీర్ పేట్‌లో సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు.. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.యువత ఆయన బాటలో నడచి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు, ఉపాద్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్,మహ్మద్ నసీర్ ఖాన్, జమాల్ , నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులుగా రోడ్డుకు అడ్డంగా చెట్టు



**మర్పల్లి మే 21(జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పరిధిలోని కల్కోడ నుండి తోర్మామిడి వెళ్లే రోడ్డుపై కల్కోడ శివారులో సోమవారం వీచిన భారీ ఈదురు గాలులతో వర్షం వల్ల పెద్ద చెట్టు రోడ్డుపై పడింది. చెట్టు రోడ్డుపై పడి మూడు రోజులు కావస్తున్న సంబంధిత అధికారులు మాత్రం తొలగించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## శాంతి వనం పార్క్ వద్ద చలివేంద్రం ఏర్పాటుచేసిన సింగిరెడ్డి పద్మారెడ్డి

- తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు సింగిరెడ్డి నరసింహారెడ్డి- లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు




**బోడుప్పల్-జనంసాక్షి** వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి తన తల్లిదండ్రులైన కీర్తిశేషులు సింగిరెడ్డి నరసింహారెడ్డి- లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం శాంతి వనం పార్క్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. శాంతివనం వాకర్స్ అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాలు అన్నదాన కార్యక్రమం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**తలకొండపల్లి మే 21(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో నాయకులతో కలిసి ప్రత్యేకంగా తయారు చేసిన కేకును కోసి ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అరటి పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ జాతిపిత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అడుగుజాడల్లో నడుస్తూ..బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ,క్రమశిక్షణ కలిగిన బీఆర్ఎస్ సైనికుడు గోలి శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గంలో తనదైన శైలిలో నిరుపేదలకు అండగా ఉంటూ పలు సేవా కార్యక్రమాలను అందిస్తున్నారని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే గొప్ప నాయకుడని పేర్కొన్నారు.గోలి శ్రీనివాస్ రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించి బీఆర్ఎస్ పార్టీకి విశిష్ట సేవలను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్,ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,తలకొండపల్లి సర్పంచుల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పెరుమండ్ల అంజయ్య,వివిధ గ్రామాల సర్పంచులు వీరేశలింగం,వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,నాయకులు విజయ్ కుమార్ రెడ్డి,బాల కుమార్ గౌడ్,వెంకటయ్య యాదవ్,శరత్ చంద్ర,సత్యం,విఠల్,రమేష్,ఏదుల రాజు,యాదయ్య,అశోక్‌గౌడ్,శేఖర్‌యాదవ్,నరసింహ,ఆంజనేయులు, శ్రీరాములు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

# గ్రామాలలో ఐమాక్స్ వెలుగుల ఏర్పాటు

## వెలిగిస్తున్న నూతన అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి )** గ్రామీణ ప్రాంతాలలో అంధకారాన్ని నిర్మూలించి వెలుగులు పంచే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేసిందని జిల్లేడు చౌదరిగుడా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గాలి గూడా, లాల్ పహాడ్, వనంపల్లి గ్రామాలలో ఐమాక్స్ లైట్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి దిశగా వేగంగా ప్రయాణిస్తున్నాయని పేర్కొన్నారు. సర్పంచులు స్వప్న సత్యం, అరుణ యాదయ్య, చందు నాయక్, వెంకట్ రాములు, సత్యనారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఆంజనేయులు, పాపయ్య, వెంకట నరసింహారెడ్డి, బాలరాజు, రజిత, గోబీరియా నాయక్, సలీం, శ్రీకాంత్, అశోక్, నర్సింలు, నవీన్, శివ మౌళి, జగన్మోహన్ రెడ్డి, శ్రీను, మల్లేష్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆర్ల లింగంను పరామర్శించిన బీఆర్ఎస్ సీనియర్ రవీందర్ యాదవ్



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన ఆర్ల లింగం ఇటీవల ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, వారి స్వగృహానికి వెళ్లిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు సంజీవయ్య, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్ ఉన్నారు.

# అంగన్వాడీలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలకు పంపాలి



**బొంరాస్ పేట, 21 ( జనం సాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నతపాఠశాలప్రధానోపాధ్యాయు లు వెంకట్ రెడ్డి గురువారం అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.మీ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపకుండా మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యార్థిఅందించడం,ఉదయంఅల్పాహారం, మధ్యాహ్నం భోజనం,ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు.అనంతరం అంగన్వాడి విద్యార్థులను పాఠశాలల్లో నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గౌసియా బేగం,సుజాత విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు,తూకాలలో మోసాలకు పాల్పడితే

# కఠిన చర్యలు: డీఎస్పీ శ్రీనివాస్

- హమాలీల సంఖ్యను పెంచి,ధాన్యం లారీలను వెంటనే అన్లోడింగ్ చేయాలి:అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి



**బొంరాస్ పేట/దుద్యాల, మే 21 ( జనం సాక్షి):** బొంరాస్ పేట మండలం బురాన్ పూర్ గ్రామ శివారులోని దుర్గాభవాని రైస్ మిల్, దుద్యాల మండలం గౌరారం గ్రామంలోని శ్రీ సాయి రైస్ మిల్లును గురువారం అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం లారీలను వెంటనే అన్లోడింగ్ చేయాలని మిల్లు యజమానులను ఆదేశించారు.అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రత ఏర్పాట్లను పరిశీలించి రైతులను మోసం చేసే దళారులు అక్రమ కొనుగోలు లేదా తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం మోహన్ కృష్ణ,ఆయా మండలాల తహసిల్దార్లు పద్మావతి, కిషన్,సిఐ శ్రీధర్ రెడ్డి,ఎస్సైలు బాల వెంకటరమణ,శ్రీశైలం,ఆర్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి



**కొందుర్గు జనంసాక్షి :** ఫ్యూచర్ సిటీ కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను గురువారం కమీషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) శ్రీ తరుణ్ జోషి, ఖూూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ల రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని గ్రేవ్ కేసులు, ఇతర పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్, స్టేషన్ ఆవరణను పరిశీలించి, సిబ్బంది మరియు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కమీషనర్ తరుణ్ జోషి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. డయల్ 100 కాల్స్ రాగానే పోలీసులు అత్యంత వేగంగా స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. సమాజానికి ముప్పుగా మారిన సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ మరియు పోక్సో (ూాజుూా) కేసులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు గానూ 'అరైవ్ అలైవ్' (ూతీతీఱఙవ ూశ్రీఱఙవ) ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. క్రైమ్ రేటును తగ్గించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ (ఖ×) కేసులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. అధికారులు తరచుగా గ్రామాల్లో పర్యటించాలి. గ్రామ పెద్దలతో మాట్లాడుతూ చట్టాలపై వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు..ఈ తనిఖీ కార్యక్రమంలో షాద్‌నగర్ డీసీపీ శిరీష, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, షాద్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ మరియు స్టేషన్ ఎస్ ఐ రవీందర్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యుడి ప్రతాపం...పోడివారుతున్న గొంతులు

- నీరు, నీడ, సరైన ఆహారమే రక్ష.
- బాలాజీ నర్సింగ్ హెుం వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్.



**తాండూరు, మే 21(జనంసాక్షి)** రాష్ట్రాన్ని దహించేస్తున్న ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలాజీ నర్సింగ్ హెుం వైద్యులు డాక్టర్ సంపత్ కుమార్ పలు సలహాలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. రోజుకు కనీసం 3--4 లీటర్ల నీరు తాగాలన్నారు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం మేలు చేస్తాయన్నారు. లేతరంగు, వదులుగా ఉండే కాటన్ దుస్తులే ధరించాలని,టోపీ, కళ్లద్దాలు మరవద్దన్నారు. .పుచ్చకాయ, దోసకాయ, సబ్జా గింజలు శరీరాన్ని చల్లబరుస్తాయని తెలిపారు. వేపుళ్లు, మసాలాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఇంట్లో ఉండి వేడి మీని తట్టుకునేందుకు ప్రత్యేక చొరవచూపాలన్నారు. ఇంట్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా కిటికీలు మూసి ఉంచాలని లేదంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహ తప్పడం వంటి లక్షణాలుంటే అది వడదెబ్బ కావచ్చు. దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.ఎండ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దు. చిన్న జాగ్రత్తలే ప్రాణాలు కాపాడతాయని పేర్కొన్నారు.

## భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి

# నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు



**హయత్ నగర్, మే 21 (జనం సాక్షి)** భారతదేశానికి అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ధ్రువతార, ఐటి రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా హయత్ నగర్ సాయిబాబా గుడి వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చేన్నగోని రవీందర్ గౌడ్ పూలమాలవేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హయత్ నగర్ మాజీ బ్లాక్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు గజ్జి శ్రీనివాస్ యాదవ్, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ శ్రీనివాస్ నాయక్, మైనార్టీ ప్రెసిడెంట్ సల్మాన్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిషోర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దశరమోని శ్రీనివాస్, మేగవత్ గోవర్ధన్ నాయక్, వి శ్రీనివాస్ ముదిరాజ్, జి బాలు నాయక్, రామావత్ సంతోష్ నాయక్, కాటేపాక రమేష్, మాడుగుల్లా చరణ్, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

- **గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి**
- **డిసిసిబి డైరెక్టర్,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**కడ్తాల్ మే 21(జనంసాక్షి):**మహిళలు తమకు నచ్చిన రంగాలలో రాణిస్తూ..స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా,డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల పట్టణంలోని కమ్యూనిటీ హాల్ లో మహిళలకు బ్యూటీ పార్లర్ పై 90 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ట్రైనర్ ఆఫ్రిన్ బేగం ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. దీనికిగాను బ్యూటీ పార్లర్ కు సంబంధించిన క్రీములు,పరికరాల కోసం రూ,10 వేలను గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి శిక్షణలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో పాటు ట్రైనర్ ను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ,గాన్గుమర్ల తండా బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాండు నాయక్,సురేష్,మహిళలు డి.రజిత, డి.సౌజన్య, పి.లక్ష్మి, ఎం.లహరి, సుల్తానా, వి.సింధు, దివ్య, పావని, భార్గవి, శశి, దేరంగుల సత్యం, బోసు వెంకటేష్, పాల్గొన్నారు.

# ఓయూ సీఈ -స్మార్ట్‌బ్రిడ్జ్ మధ్య అవగాహన ఒప్పందం

**సికింద్రాబాద్(జనంసాక్షి):**విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జ్ సంస్థ అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, హ్యాకథాన్‌లు, అనుభవాత్మక అభ్యాస (ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్) కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఒప్పందం ఓయూ సీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ సమక్షంలో జరిగింది.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సిద్ధాంతపరమైన విద్యతో పాటు ప్రాయోగిక అనుభవాన్ని అందించడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారు సిద్ధమవుతారని పేర్కొన్నారు. స్మార్ట్‌బ్రిడ్జ్ వ్యవస్థాపకుడు, సీఈఓ కె. అమరేందర్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం పరిశ్రమలు–విద్యాసంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించే ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్మార్ట్‌బ్రిడ్జ్ తరఫున వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్) ఎస్. శ్రీదేవి, లీడ్ యాక్సిలరేటర్ (రోబోటిక్స్ ఐఓటీ) డా. డి. నరేందర్ సింగ్ పాల్గొన్నారు.

# ఈఏపీసెట్‌లో 30వ ర్యాంక్ సాధించిన కార్తిక్‌కు అభినందనలు



**రాజేంద్రనగర్,మే21(జనంసాక్షి) :** అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని ప్రశాంతి నగర్ కాలనీకి చెందిన కార్తీక్ ఈఏపీసెట్‌లో 30వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కస్తూరి నరేందర్, పార్టీ అధ్యక్షుడు జితేందర్, కిరణ్, పురుషోత్తం, యలాల నరేష్, ముత్యాలు కార్తిక్ నివాసానికి వెళ్లి అతని తల్లిదండ్రులను అభినందించారు. కార్తిక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. యువతకు కార్తిక్ ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు.

# మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న షాద్ నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్



**ఫరూఖ్ నగర్ జనంసాక్షి :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో భవన నిర్మాణం లో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికుల సమస్యలపై షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ కి వినతి పత్రం అందజేసిన సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నడికూడ ఆంజనేయులు, రంగంపల్లి ఆంజనేయులు సబావత్ భాస్కర్, రమేష్ నాయక్, టేకులపల్లి నర్సింలు తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.



# జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రాని మర్యాదపూర్వకంగా కలిసిన బిఎస్ఆర్

**తాండూరు మే 21(జనంసాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రా ను ఆర్బిఓఎల్ సీఈఓ బయ్యని శ్రీనివాస్ రెడ్డి(బిఎస్ఆర్) మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలను బయ్యని శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఎస్పీ స్నేహా మేహ్రా నాయకత్వాన్ని ప్రశంసించారు.



# రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రాంపూర్ సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్**

**తలకొండపల్లి మే21 (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నాయకులు,రైతులతో కలిసి రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల–శ్రీశైలం యాదవ్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు పండించిన వరి పంటను ప్రభుత్వం అందించే మద్దతు ధరలకే అమ్ముకోవాలని రైతులకు సూచించారు.మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటను విక్రయించవచ్చని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా ప్రభుత్వం అందించే మద్దతు ధరకే రాంపూర్ గ్రామంలో మహారాజా గోదాము వద్ద వితరణ చేసుకోవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు ముదిరాజ్, హనుమాన్ టెంపుల్ చైర్మన్ మధు వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్లు శ్రీనివాస చారి, భీమమ్మ యాదయ్య, మాజీ ఎంపిటిసి కటికల మణెమ్మ యాదయ్య,వార్డు సభ్యులు కాకి రాము,సప్పిడి సునీత తనయుడు శివ,మహారాజా సొసైటీ డైరెక్టర్ పెద్ద హరి మోహన్ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు,రెడ్డి సంఘం చైర్మన్ చిన్న హరి మోహన్ రెడ్డి, పద్మమ్మ, బచ్చు మనోహర్, యామ లక్ష్మణ్, విష్ణు, పాండు రెడ్డి,పెద్ద మల్లయ్య, మల్లేష్, రొయ్యల మహేష్, శివ ,మహమాలి వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.